క్లుప్తంగా

రేపు రుణ మేళా

ఎంపీడీఓ జి.కాశయ్య

నకరికల్లు: ఈనెల 3వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రుణ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.కాశయ్య మంగళవారం తెలిపారు. అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకుల సహకారంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణ మేళా జరుగుతుందన్నారు. బీసీ, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, మేదర, శాలివాహన, ఈబీసీ కార్పొరేషన్‌లకు సంబంధించి స్వయం ఉపాధి పథకాల ద్వారా రుణాలు మంజూరు చేస్తారని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరూ దరఖాస్తు పత్రాలతో పాటు సంబంధిత ధ్రువీకరణపత్రాలతో రుణ మేళాకు హాజరు కావాలని సూచించారు. రుణమేళాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నకరికల్లు శాఖ, జీడీసీసీ బ్యాంకు గుండ్లపల్లి, రూపెనగుంట్ల, కుంకలగుంట శాఖలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కండ్లకుంట శాఖ మేనేజర్‌లు హాజరవుతారని, సద్వినియోగం చేసుకోవాలని దరఖాస్తుదారులకు సూచించారు.

ఇంటర్ ప్రత్యేక తరగతులు ప్రారంభం

బెల్లంకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశానుసారం ఏప్రిల్ ఒకటి నుండి 23వ తేదీ వరకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్ విద్యార్థులతో పాటు పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, బ్రిడ్జ్ కోర్సులలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌కు సత్కారం



సత్తెనపల్లి: మదర్ థెరిస్సా ఆదరణ సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.ఆనంద్‌కుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లా బెస్ట్ అవార్డు గ్రహీత, మదర్ థెరిస్సా ఆదరణ సంక్షేమ కేంద్రం అధ్యక్షుడు చిలక జాన్సన్, ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ జొన్నలగడ్డ మణిదాసు, నల్లూరు రవి, చిలుకా రమణయ్య, బండారు శ్రీకాంత్, బొజ్జ నరేష్‌లు పూలమాలలు, మెమెంటో, కిరీటంతో సత్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్, మణిదాసు మాట్లాడారు.

వైఎస్సార్‌సీపీ మండల ఆత్మీయ సమావేశం నేడు

ముప్పాళ్ళ: వైఎస్సార్‌సీపీ మండల స్థాయి ఆత్మీయ సమావేశం ఈ నెల 2వ తేదీన జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు హాజరు కావాలని కోరారు.

సత్తెనపల్లి కోర్టుకు మాజీ ఎంపీ నందిగం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ మంగళవారం హాజరయ్యారు. అమరావతి పోలీస్ స్టేషన్‌లో గతంలో నమోదైన కేసులో ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా బెయిల్ గడువు ముగియడంతో మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. కోర్టు నుంచి సమన్లు వచ్చిన తరువాత హాజరయ్యేలా కేసును వాయిదా వేశారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చిలుకా జయపాల్, పెదకూరపాడు లీగల్ సెల్, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి, దళిత నాయకులు గుజ్జర్లపూడి కృపాకర్, చంటి తదితరులు కలిశారు.

రుణ మేళాకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలి

ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 2న నిర్వహించే రుణ మేళాకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ కాశయ్య మంగళవారం తెలిపారు. ఓబీఎంఎం పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీ, కాపు, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, మేదర, శాలివాహన, ఈబీసీ కార్పొరేషన్‌లకు సంబంధించి రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు, సంబంధిత పత్రాలతో హాజరుకావాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే రుణ మేళాకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(మాదల), చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్(ముప్పాళ్ళ), యూనియన్ బ్యాంక్(సత్తెనపల్లి) మేనేజర్‌లు పాల్గొంటారని తెలిపారు.

తెరుచుకోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

- భవనం తాళాలు అప్పగించలేదంటున్న పీహెచ్‌సీ అధికారులు
- 2023లోనే అప్పగించామంటున్న పంచాయతీరాజ్ శాఖ





దొడ్లేరు-2 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



HANDED OVER CERTIFICATE

పీహెచ్‌సీకి భవనం అప్పగించినట్లు ఉత్తర్వుల కాపీ

దొడ్లేరు(క్రోసూరు): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌ల భవనాలు నిర్మించి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందించటం జరిగింది. కానీ మండలంలోని దొడ్లేరు గ్రామంలో దొడ్లేరు-2 సచివాలయ పరిధిలో ప్రజల కోసం నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పూర్తి చేసి 2023లోనే మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించటం జరిగింది. అప్పటి మండల పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రమాదేవికి అప్పగించినట్లు ఉత్తర్వులు కూడా ఉన్నాయి. భవనంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తారు. దీంతోపాటు కొన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ ఉంది. కానీ అప్పటి నుంచి ఆ భవనంలో అసలు విధులు నిర్వహించటం లేదు. దీనిపై స్పందించిన పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సిరిచందన హెల్త్ క్లినిక్ భవనం ఆన్‌లైన్‌లో పీహెచ్‌సీకి అప్పగించినట్లు ఉంది కానీ తమకు తాళాలు అప్పగించలేదని, భవనంలో పనులు పూర్తి కాలేదంటూ చెబుతున్నారు.

■ దీనిపై దొడ్లేరు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావును వివరణ అడగ్గా భవనం పీహెచ్‌సీకి 2023లోనే అప్పగించటం జరిగిందని, వారు ఎందుకు ఉపయోగించటం లేదో తెలియదని చెబుతున్నాడు. రూ.21 లక్షల నిధులతో భవనం నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ రూ.17.50 లక్షలు మంజూరు చేసినట్లు బిల్డింగ్ హ్యాండ్ ఓవర్ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉంది. భవనంలో కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ అసలు తమకు అప్పగించలేదని పీహెచ్‌సీ అధికారులు, ఏనాడో అప్పగించామని పంచాయతీరాజ్ అధికారులు అంటుండడంతో సమస్యగా మారిందని, దీనిపై జిల్లా వైద్యాధికారులు, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు, తక్షణమే పరిశీలించి భవనం ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం



భూమి పూజలో ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి

సత్తెనపల్లి: రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సత్తెనపల్లి మండల పరిధిలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ పంచాయతీలో మంగళవారం భూమి పూజ చేశారు. గర్నెపూడి, నందిగామ, గుజ్జర్లపూడి, దీపాలదిన్నెపాలెం, గోరంట్ల, పెదమక్కెన, గుడిపూడి, పణిదం, బట్లూరు గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, పార్టీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, ఏపీడీ పీవీ నారాయణ, ఎఫ్ఏ ఎస్.మార్కండేయులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ

క్రోసూరు: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 5 పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తెలిపారు. యూనిట్‌కు రూ.35 వేలు చొప్పున క్రోసూరులో రెండు యూనిట్లు, గుడిపాడు, గరికపాడు, గాదెవారిపాలెం గ్రామాలకు ఒక్కొక్క యూనిట్ చొప్పున మంజూరైనట్లు చెప్పారు. క్రోసూరు పంచాయతీలోని ఎర్రబాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద నీటి తొట్టి నిర్మించేందుకు మంగళవారం ఎంపీడీవో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వెంకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి, పీఎస్ జానకీనాథ్ పాల్గొన్నారు.

కవి బ్రహ్మ వెంకట నరసయ్య యువతకు ఆదర్శం



పెదకూరపాడు: కవి బ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య యువతకు, సమాజానికి ఆదర్శమని క్రోసూరు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాల్ రావు అన్నారు. మంగళవారం పెదకూరపాడులోని లైబ్రరీ సెంటర్లో పెదకూరపాడు అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో వెంకట నరసయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజాకవి దర్శి శేషారావు మాట్లాడుతూ పెదకూరపాడుకు చెందిన వెంకట నరసయ్య తన కవితల ద్వారా గ్రామానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. ఆనాటి సమాజంలో ఉన్న రుగ్మతలను తన కవితల ద్వారా చీల్చి చెండాడారన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ అప్పారావు, కంచర్ల నాగేశ్వరరావు, మలినేని మస్తాన్ రావు, పొట్టి శ్రీనివాసరావు, డి.మోహన్ రావు, షేక్ మొహిద్దీన్, కోరంపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు
- సత్తెనపల్లిలో మున్సిపల్ కార్మికుల నిరసన



గార్లపాడు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సత్తెనపల్లి: ఆప్కాస్ రద్దు చేసి పారుగు సేవల సిబ్బందిని ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు డిమాండ్ చేశారు. ఆప్కాస్ స్థానంలో ప్రైవేటు ఏజెన్సీలను అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మంగళవారం సత్తెనపల్లి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు స్థానిక గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హరిపోతురాజు మాట్లాడుతూ మార్చి 6వ తేదీన సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దు చేసి పారుగు సేవల సిబ్బంది నియామకాలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానించినట్లు వచ్చిన వార్తలు మున్సిపల్ కార్మికులను ఆందోళనకు గురిచేశాయన్నారు. కార్మికులలో నెలకొన్న భయాందోళనలను సంబంధిత మంత్రి, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఆప్కాస్ రద్దు చేయడం లేదన్న విషయాన్ని స్పష్టంగా వారు చెప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలో ప్రైవేట్ ఏజెన్సీల విష వలయంలో చిక్కుకుపోకుండా తమ హక్కులను కాపాడుకునేందుకు మున్సిపల్ కార్మికులకు పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ నేపథ్యంలో దశల వారీగా పోరాటం, ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సంతకాల సేకరణ, పట్టణాల్లో కార్మికుల ప్రదర్శన, మంత్రి నారాయణకు సంతకాల సేకరణ ప్రతులు అందజేయడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, మున్సిపల్ కార్మికులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాట కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుకుమార్, బొమ్ము రాజశేఖర్, మేడి సత్యవతి, సీఐటీయూ పట్టణ సహాయ కార్యదర్శి జడ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



అమరావతి: గత నెల 13వ తేదీన మండల పరిధిలోని లింగాపురం చోరీ కేసులో నిందితుడిని మంగళవారం అమరావతి పోలీసులు అరెస్టు చేసి బంగారం రికవరీ చేశారు. లింగాపురంలో మార్చి13న షేక్ మీరాబీ ఇంట్లో చోరీ జరిగింది. దీనిపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం అమరావతి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అదే గ్రామానికి చెందిన గార్లపాటి నాగేంద్ర కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందుతుడు గార్లపాటి నాగేంద్ర కుమార్ నుంచి నగల రూపంలో ఉన్న 55 గ్రాముల బంగారం రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ నిందుతుడు బంగారంతో పాటు దొంగిలించిన రూ.40 వేల నగదు సొంత ఖర్చులకు ఖర్చు చేశాడన్నారు. నిందుతుడు నాగేంద్ర కుమార్‌పై కేసు నమోదు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

వంతెన పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అజయ్



ఒడిశాకు చెందిన వలస కార్మికుడు

యడ్లపాడు: సినీ తరహాలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... సత్తెనపల్లికి చెందిన ఆళ్ల అజయ్ ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు ప్రయాణిస్తుండగా, యడ్లపాడు గ్రామంలోని ఎరక్రొండ వద్ద హైవే వంతెనపై నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. వేగంగా ఉన్న బైక్ అదుపతప్పి వంతెన గోడను బలంగా ఢీకొంది. దీంతో గాల్లోకి ఎగిరిన ఆజయ్ వంతెన పైనుంచి కింద ఉన్న సర్వీసు రోడ్డులోకి వచ్చి పడ్డాడు. ఈ ప్రమాదంలో బైక్‌కు అడ్డు వచ్చిన వ్యక్తితో పాటు సర్వీసులో పడిపోయిన యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన వారిని 108 వాహనం ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. రోడ్డు దాటుతూ బైక్ తగిలి గాయపడ్డ వ్యక్తి సమీప నూలుమిల్లులో పని చేసే ఒడిశాకు చెందిన వలస కార్మికుడిగా పోలీసులు భావిస్తున్నట్లు ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి సొంత ఖర్చులతో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాలలో మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న సుమారు 120 మంది విద్యార్థులకు వేసవి సెలవుల వరకు ప్రతి రోజు మజ్జిగను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల చైర్మన్ నరసింహారావు, నాయకులు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లను అందరూ గౌరవించాలి

అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవం



కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల మధ్యన కేక్ కట్ చేస్తున్న బెంజిమిన్

నరసరావుపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ ట్రాన్స్‌జెండర్లను గౌరవించాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమిన్ కోరారు. అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన ట్రాన్స్‌జెండర్ల మధ్యన కేక్ కట్‌చేశారు. డైరెక్టర్ ఆనంద్ బెంజమిన్ మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లు అనేక సవాళ్ళు, వివక్షత ఎదురుకొంటున్నారని, వారిని సమాజంలో మనతో సాటివారిగా చూడాలని పిలుపునిచ్చారు. సమాన అవకాశాలు, హక్కులు వారికి ఉన్నాయని తెలియజేశారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల రక్షణ) చట్టం, 2019 అనేది ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల రక్షణ, వారి సంక్షేమం, ఇతర సంబంధిత విషయాలను అందించే లక్ష్యంతో భారత పార్లమెంట్ చేసిన చట్టమని దానిని సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవించి వారిహక్కులను కాపాడాలన్నారు. సుఖవ్యాధులు, హెచ్ఐవీ అరికట్టటంలో వారు కూడా భాగస్వాములు కావటం మంచి పరిణామని అన్నారు. సౌమ్య నాయిక, ఎస్ఆర్‌కేటీ చాందిని, అంకిత మాట్లాడారు. పీఎం ఉదయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలో మంగళవారంతో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. డివిజన పరిధిలోని 14 మండలాల్లో 60 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 11,223 మందికి గాను 11,105 మంది హాజరు కాగా 118 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 83 మందికి గాను 57 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. డివిజన్ వ్యాప్తంగా రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 11,306 మందికి గాను 11,162 మంది హాజరు కాగా 144 మంది గైర్హాజరయ్యారు. చివరి రోజు సోషల్ పరీక్షతో ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి.

రాజుపాలెం: మండలంలో మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు 434 మంది విద్యార్థులకు గాను 427 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో 1, 2 మల్లికార్జునశర్మ, నరసింహారావులు తెలిపారు.

క్రోసూరు: మండలంలో మంగళవారం జరిగిన సోషల్ పరీక్షకు మొత్తం 907 మంది విద్యార్థులకు గాను 905 మంది హాజరైనట్లు ఎంఈవో ఎం.గణేష్ తెలిపారు.

బడ్జెట్‌లో చేనేత కార్మికులకు మొండి చెయ్యి

ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం



మాట్లాడుతున్న అనుముల వీరబ్రహ్మం, పక్కన నాయకులు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈసారి కూడా చేనేత కార్మికులకు మొండి చెయ్యి చూపిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం అన్నారు. పట్టణంలోని పణిదం చేనేత సహకార సంఘం బిల్డింగులో మంగళవారం జరిగిన సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు అధ్యక్షత వహించారు. వీరబ్రహ్మం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత రంగానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. త్రిఫ్ట్ ఫండ్ స్కీమ్ పాత బకాయి కింద కేవలం రూ.5 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారన్నారు. చేనేతల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8న అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖ కార్యాలయాల వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బత్రా పానకాలు, పంతంగి ప్రభాకర్, గడ్డం సుశులోస్, గరికపూడి ఏసురత్నం, మోపర్తి బాబురాజు, నాగలక్ష్మి ఉన్నారు.

ఆలయ శిలా నిర్మాణ పనులు ప్రారంభం



శిలా నిర్మాణపనులను ప్రారంభిస్తున్న ఈవో, ఆలయ అర్చకులు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి నూతన ఆలయ శిలా నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించినట్లు దేవదాయ శాఖ ఈవో అవుడూరి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో దాదాపు రూ.2 కోట్లకు పైగా వ్యయంతో ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. బెల్లంకొండ మండలానికి చెందిన ఢిల్లీలో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న రామ్‌గోపాల్ నాయక్ సహకారంతో ఆలయ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులలో భాగంగా ప్రత్యేకమైన రాయితో శిలా నిర్మాణ పనులను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఎటువంటి విఘ్నాలు లేకుండా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆలయ పండితులు పూజలు నిర్వహించారు.

93 శాతం పింఛన్‌లు పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ కాశయ్య, ఈఓపీఆర్డీ శివప్రసాద్

నకరికల్లు: మండలంలో 93 శాతం పింఛన్‌లను తొలిరోజు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జి.కాశయ్య తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల సిబ్బంది సహకారంతో 9,392 పింఛన్‌లకు గాను 8,721 పింఛన్‌లను పంపిణీ చేశామని అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం



పురస్కారం అందుకుంటున్న రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవి



పురస్కారం అందుకుంటున్న పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్

సత్తెనపల్లి: కళ, సాహిత్య రంగాల్లో సేవలు అందిస్తున్న పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఇరువురికి ఉగాది జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఎంవీఆర్ కల్చరల్ అకాడమీ, ఎల్‌సీఈఎస్ కళా నిలయం ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 31న లాస్య ప్రియ పబ్లిక్ స్కూల్ ఆవరణలో విశ్వావసు ఉగాది జాతీయ పురస్కారాలు-2025 కార్యక్రమం ఒంగోలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి జాతీయ సాహిత్య సేవా కళాభరణం అవార్డు, బంగారు కలశ పీఠం అవార్డు అందజేసి మెమెంటో, సర్టిఫికెట్, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు విభిన్న పౌరాణిక పాత్రలను ధరించి రెండు తెలుగు రాష్ట్రాల్లో తన పౌరాణిక ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులను రంజింపచేసినందుకు జాతీయ పౌరాణిక కళాతపస్వి, ఉగాది పూర్ణకుంభపీఠం ప్రదానం చేసి మెమెంటో, సర్టిఫికెట్, శాలువాతో సత్కరించారు. ఈ పురస్కారంతో రవికుమార్ 50 పురస్కారాలు పొందారు. ఇరువురిని పట్టణానికి చెందిన వివిధ కళా సంస్థల అధినేతలు, కళాకారులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

బాలికను వేధించిన కేసుపై విచారణ

నాదెండ్ల: పట్టణంలోని వివాహిత మహిళకు కొన్నాళ్లకు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత వేరే వ్యక్తితో సహజీవనం చేస్తూ మొదటి భర్తకు విడాకులు ఇచ్చింది. సహజీవనం చేస్తున్న వ్యక్తితో ఉంటూ భర్త దగ్గర ఉన్న పిల్లలని అప్పుడప్పుడు పాఠశాల వద్దకు వెళ్లి కలుస్తూ పాపని ఇంటికి తీసుకొని వస్తూ ఉండేది. ఈ క్రమంలో డిసెంబర్లో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకునే పాపని తన వద్దకు తీసుకొని వచ్చింది. ఆ తర్వాత రోజు కొడుతూ చిత్రహింసలు పెడుతూ బెల్టుతో కాళ్ళు, చేతులు మీద కొట్టటమే కాకుండా, వంటిమీద పలుచోట్ల కాలుస్తూ చిత్రహింసలకు గురి చేసేది. దూరంగా ఉన్న భర్త, నాయనమ్మ ఇంటి వద్దకు వెళ్తూ ఉండగా పాపా రోడ్డుమీద ఆడుకుంటూ స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో తండ్రి నాయనమ్మ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి పోలీసు మీడియాకు సమాచారం తెలియజేశారు. ఈ ఘటన నిన్న మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి కసాయితల్లి, ప్రియుడి గురించి విచారణ చేపట్టారు. మంగళవారం పల్నాడు జిల్లా డీసీపీఓ, నాదెండ్ల సీడీపీఓ పాప నివాసం వద్దకు వెళ్లి పాపకు జరిగిన అన్యాయం మీద విచారణ చేపట్టి వివరాలు సేకరించారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

వినుకొండ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం దర్శనానికి వినుకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి 21 సోమవారం తిరుత్తణి శ్రీ కుమారస్వామి వారి దర్శనం, 12 గంటలకు శివకంచి, విష్ణుకంచి దర్శనం, 21 సోమవారం రాత్రి అరుణాచలం దర్శనం చేసుకొని గిరి ప్రదక్షణ పూర్తి చేసి 22న మంగళవారం ఉదయం గోల్డెన్ టెంపుల్, మధ్యాహ్నం 3 గంటలకు కాణిపాకం వినాయకుని దర్శనం అనంతరం తిరిగి 23 ఉదయం 4 గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2550లు నిర్ణయించామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా క్షేత్రాల తీర్థయాత్రలకు నెల 11వ తేదీన శుక్రవారం రాత్రి 9గంటలకు ప్రత్యే బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహానంది, బనగానపల్లె, నేలమట్టం ఆశ్రమం, యాగంటి, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, కాశీనాయన జ్యోతిమఠం క్షేత్రాల సందర్శన అనంతరం 14 సోమవారం ఉదయం 5గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. టిక్కెట్ ధర రూ.1600లు నిర్ణయించడమైందని, మరిన్ని వివరాలకు ఆర్టీసీ డిపోల సంప్రదించాలన్నారు.